పూలతోటకు.. రక్షణ కోట



అలంకార ప్రియుడు, శ్రీవేంకటేశ్వర స్వామి నిత్యపూజల కోసం రకరకాల ఫల పుష్పాలు ఉపయోగిస్తుంటారు. ప్రధానంగా తిరుమలలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వనం నుంచి సేకరించిన ఫల పుష్పాలనే ఎక్కువగా వినియోగిస్తుంటారు. తిరుమల బాటగంగమ్మ అమ్మవారి ఆలయానికి ఎదురుగా 7.5 ఎకరాల విస్తీర్ణంలో పన్నీరు రోజా, చామంతి, నాటురోజా, తులసి మొక్కలు పెంచుతున్నారు. వాటిపై దోమలు, కీటకాలు ఎక్కువగా వాలుతుండటంతో నాణ్యమైన పుష్పాలు రావడం లేదు. దీనిని గమనించిన సిబ్బంది జిగురు అట్టలు ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం వాటి బెడద తగ్గిందని సిబ్బంది పేర్కొంటున్నారు.

– ఈనాడు, తిరుపతి

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా మంగళవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 7 కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్నారు. వీరికి దాదాపు 6 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని ఆరు కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్నారు. వీరికి మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని రూ.64,894 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.82 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

చైతన్య తరంగాలు..

హ్యాకథాన్‌కు ఐఐటీ డ్రోన్లు ◆ నాలుగు ఆవిష్కరణలతో హాజరు

విజ్ఞాన విహంగాలు

ఈనాడు డిజిటల్, తిరుపతి:



నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తూ.. సాంకేతికతను అందిపుచ్చుకొనే దిశగా తిరుపతి ఐఐటీ అడుగులు వేస్తోంది. అమరావతిలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న డ్రోన్ సమ్మిట్‌లో నాలుగు ఆవిష్కరణలతో అబ్బురపరిచింది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఏపీ డ్రోన్ కార్పొరేషన్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. వ్యవసాయం, విపత్తు సహాయ చర్యల్లో దన్నుగా నిలిచేలా ఐఐటీ డ్రోన్లు ఉన్నాయి. 20 మంది విద్యార్థులు 10 మంది అధ్యాపకులు హ్యాకథాన్‌కు హాజరు కాగా ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ సహాయ ఆచార్యులు డా.సత్యేంద్రనాథ్ రూపొందించిన ప్రకృతి విపత్తుల ఏరియల్ బేస్ స్టేషన్ ప్రాజెక్టుకు ఉత్తమ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను 'ఈనాడు'తో పంచుకున్నారు.

ఆవిష్కరణలివే..

- వరదలు సంభవించినప్పుడు సహాయం కోసం ఎదురు చూసే వ్యక్తులను గుర్తించడం
- ప్రభుత్వ డేటాబేస్ నుంచి విపత్తుల దృశ్యాలతో రియల్ టైమ్ పీపుల్ ట్రాకింగ్
- పంట దిగుబడి అంచనా, వైఫల్యాలపై హెచ్చరిక
- ప్రకృతి వైపరీత్యాల సమయంలో నెట్‌వర్క్‌ని పునరుద్ధరించడానికి ఏరియల్ బేస్ స్టేషన్

కొత్తవాటికి ప్రోత్సాహం



డ్రోన్ సమ్మిట్‌కు రావడం చాలా ఆనందంగా ఉంది. కొత్త ఆవిష్కరణలు ప్రోత్సహించే విధంగా ఈ సమ్మిట్ జరుగుతోంది. వివిధ రకాలు డ్రోన్లు అవి ఉపయోగపడే విధానం గురించి తెలుసుకునేందుకు మంచి అవకాశం లభించింది. మేము తెచ్చిన డ్రోన్లు ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం. – ఇమ్రాన్, విద్యార్థి, ఐఐటీ తిరుపతి

సాంకేతికత తెలుసుకునేందుకు



మేము ఫ్లడ్ ట్రాకర్ డ్రోన్ ప్రదర్శించేందుకు వెళ్లాం. సృజనాత్మకను పెంపొందించి నూతన పారిశ్రామిక విధాన నిర్మాణానికి ఈ సమ్మిట్ ఉపయోగంగా ఉంది. ఇతర ప్రాంతాలతో కలిసి పోటీపడటం గర్వంగా ఉంది. కొత్త సాంకేతికతను తెలుసుకునేందుకు ఇదొక వేదిక.

– అయూష్, విద్యార్థి, ఐఐటీ తిరుపతి

సంతోషంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై పనిచేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుత సమాజానికి కాకుండా ముందస్తు రోజుల్లో ఎలాంటి ప్రమాదాలు జరిగినా గుర్తించే డ్రోన్లు ఈ సమ్మిట్‌కు వచ్చాయి. తిరుపతి ఐఐటీ నుంచి అద్భుత ఆవిష్కరణలతో హాజరయ్యాం. అందులో ఒక దానికి బహుమతి రావడం సంతోషంగా ఉంది.

– డా.రోషన్ శ్రీవత్సవ్, ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్ట్ డైరెక్టర్



ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు అందుకుంటున్న ఐఐటీ ఆచార్యులు

డ్రోన్ టెక్నాలజీ భాగస్వామిగా తిరుపతి ఐఐటీ

ఏర్పేడు, న్యూస్‌టుడే: డ్రోన్ టెక్నాలజీకి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించేందుకు తిరుపతి ఐఐటీ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇంటిగ్రేషన్, డిజిటల్ ట్విన్ టెక్నాలజీ, స్టార్టప్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడం వంటి కీలక రంగాల్లో సాంకేతిక అభివృద్ధిపై ఐఐటీ దృష్టి పెట్టనుంది. ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలు, సాంకేతిక పురోగతుల ఆవిష్కరణలు పెంపొందించడమే లక్ష్యంగా ఒప్పందం కుదుర్చుకుంది.

వాన కురిస్తే గండమే!



చిన్న వర్షాలు కురిసినా చిత్తూరు- బలిజకండ్రిగ మార్గంలోని వెంగళరాజుకుప్పం వద్ద దుస్థితి ఇది. ఇక్కడ కల్వర్టు దెబ్బతినడంతో వానలు పడ్డ ప్రతిసారీ వెంగళరాజు కుప్పం, బలిజకండ్రిగ, పాలసముద్రం పంచాయతీల్లోని విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- కల్వర్టులు, వంతెనలను పట్టించుకోని వైకాపా
- రూ.862.68 కోట్ల ప్రతిపాదనలకు లభించని ఆమోదం
- కూటమి ప్రభుత్వం స్పందిస్తే తప్పనున్న ఇబ్బందులు



సోమల మండలం పెద్దఉప్పరపల్లె, బసవపల్లె మధ్యలోని గార్గేయ నదిపై ఉన్న తాత్కాలిక వంతెన తెగిపోయింది. దీనివల్ల ఎనిమిది గ్రామాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతోంది.

ఈనాడు, చిత్తూరు: భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ లోతట్టు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. వరద వస్తే కల్వర్టులు, వంతెనలపై ప్రవాహం పోటెత్తుతుండటంతో చుట్టూ తిరిగి గమ్యస్థానానికి చేరుకోవాల్సి వస్తోంది. తాజా వానలతో సోమల, తవణంపల్లె, ఐరాల మండలాల్లో ప్రమాద ఘంటికలు మోగాయి. తాత్కాలిక కల్వర్టులు కొట్టుకుపోవడంతో దాదాపు 20 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వైకాపా హయాంలో శాశ్వత ఉపశమన చర్యలు తీసుకోకపోవడంతో గార్గేయ, నీవా, కుశస్థలి, కౌండిన్య, బహుదా నదులకు అధిక ప్రవాహం వస్తే మరోసారి ప్రజానీకం ఇబ్బందులు పడాల్సిందే.

2020 నివర్, 2021 నవంబరులో జిల్లాలో భారీ వర్షాలకు పుంగనూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో కల్వర్టులు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సోమల- నంజంపేట మార్గంలోని జీడీ రేవుల వంక వద్ద ఉన్న వంతెన, సదుం- జాండ్రపేట మార్గంలో వారధి కొట్టుకుపోయాయి. ఇలా దాదాపు 72 కల్వర్టులు, వంతెనలకు నష్టం వాటిల్లింది. ఫలితంగా వారం- 15 రోజులపాటు వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదురయ్యాయి. సోమల మండలంలోనైతే ఏడు పంచాయతీల ప్రజలు దాదాపు 45 రోజులు కష్టాలు అనుభవించారు.

కొత్తవి నిర్మిస్తేనే..

తాజా వర్షాలకు కల్వర్టులపైకి వరద వచ్చింది. నవంబరులో భారీ వర్షపాతం నమోదైతే సోమల, తవణంపల్లె, ఐరాల, పెనుమూరు, పూతలపట్టు, బైరెడ్డిపల్లె మండలాల్లో తాత్కాలిక పనులు చేసిన చోట మరోసారి ముప్పు తప్పదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి దెబ్బతిన్న కల్వర్టుల స్థానంలో కొత్తవి కట్టడంతోపాటు కొంత ఎత్తులో నిర్మించాలి.

తాత్కాలిక పనులతో సరిపెట్టి

అప్పట్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 415.38 కి.మీ రోడ్డు దెబ్బతింది. రూ.28.57 కోట్లతో తాత్కాలిక ప్రాతిపదికన పనులు చేపట్టారు. శాశ్వత నిర్మాణాలకు రూ.387.73 కోట్లు అవసరమని నివేదికలు పంపినా ప్రభుత్వం పట్టించుకోలేదు. రహదారులు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) కింద వచ్చే 464.95 కి.మీ మేర రోడ్డు దెబ్బతింది. రూ.35.38 కోట్లతో కొంతవరకు పనులు చేశారు. పూర్తిస్థాయి మరమ్మతులకు రూ.503 కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిధులు రాలేదు. సదుం మండలంలోనే కూలిన వంతెన స్థానంలో కొత్తది నిర్మించారు. సోమల మండలంలో మరొకటి కట్టారు.

- 2020, 2021లో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో దెబ్బతిన్న రహదారులు: 185; దెబ్బతిన్న దూరం: 415.38 కి.మీ
- తాత్కాలిక పనులకు చేసిన వ్యయం: రూ.28.57 కోట్లు; శాశ్వత పనులకయ్యే వ్యయం: రూ.387.73 కోట్లు
- ఆర్ అండ్ బీ పరిధిలో దెబ్బతిన్న రహదారులు: 85; దెబ్బతిన్న దూరం: 464.95 కి.మీ.
- తాత్కాలిక మరమ్మతులకు వెచ్చించింది: రూ.35.38 కోట్లు; శాశ్వత పనులకు ప్రతిపాదనలు: రూ. 503 కోట్లు

సేవల్లో ఎన్టీఆర్ ట్రస్టు ముందంజ

ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి



వర్చువల్ విధానంలో డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి, సీఈవో రాజేంద్రకుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాల్లో ప్రభుత్వం కంటే ముందుగా ఎన్టీఆర్ ట్రస్టు ఉంటుందని ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ, సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉచిత డీఎస్సీ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె వర్చువల్‌గా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 2009లో 256 మందికి డీఎస్సీ శిక్షణ ఇవ్వగా 32 మంది ఉద్యోగాలు సాధించారని చెప్పారు. 2012లో 210 మందికి 16 మంది, 2014లో 200 మందికి 27 మంది డీఎస్సీలో ఉద్యోగాలు సాధించి స్థిరపడ్డారని తెలిపారు. 2010లో 180 మందికి సైనిక శిక్షణ ఇవ్వగా 36 మంది, 2018లో 350 మందికి కానిస్టేబుల్ శిక్షణ ఇవ్వగా 12 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టు శిక్షణతో పాటు కుట్టు మిషన్లు అందించినట్లు వివరించారు. ప్రస్తుతం డీఎస్సీ శిక్షణకు 1,200 మందికిపైగా పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ మునిరత్నం పాల్గొన్నారు.

కుండపోత వర్షం.. తెగిన వంతెనలు

సోమల: మండలంలోని పెద్దఉప్పరపల్లె-బసవపల్లె మార్గంలో గార్గేయనది ఉగ్రరూపం దాల్చడంతో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించాయి. పలు మార్గాల్లో నీటి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రెడ్డివారిపల్లె, చిన్నకమ్మపల్లె, ఎస్సీకాలనీ, బోనమంద, బసవపల్లె పేటూరు, ఇర్లపల్లె తదితర గ్రామాలకు రాకపోకలు ఆగాయి. సోమల-నంజంపేట మార్గంలోని జీడిరేవువంక ఉద్ధృతికి తాత్కాలిక వంతెన దెబ్బతిని ఈ మార్గంలో ఏడు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి.



జీడిరేవులవంకపై తాత్కాలిక వంతెన కొట్టుకుపోయిన దృశ్యం

ఎన్టీఆర్ జలాశయానికి వరద



పెనుమూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జలాశయానికి మంగళవారం మధ్యాహ్నం వరద రాకతో నీటి మట్టం పెరుగుతోంది. సాయంత్రం రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఇన్‌ఫ్లో వెయ్యి క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో నీవా నదిలో నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పోలీసు శాఖకు 27 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు(నేరవార్తలు): జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 27 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మణికంఠ ఫిర్యాదులను స్వీకరించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులతో మాట్లాడారు. పోలీసుస్టేషన్‌లకు వచ్చే ప్రతి ఫిర్యాదును స్వీకరించి.. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, రసీదును బాధితులకు ఇవ్వాలన్నారు. ఏ ఫిర్యాదుపై నిర్లక్ష్యం ఉండకూడదన్నారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయండి

చిత్తూరు(మిట్టూరు): ప్రభుత్వ, వాణిజ్య, పరిశ్రమల సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన డీఈఈలు, ఏఈలతో వీడియో సమావేశం నిర్వహించారు. మీటర్లు అమర్చే కంపెనీ సిబ్బందికి విద్యుత్తు శాఖ అధికారులు సహకరించాలని తెలిపారు. చిత్తూరు అర్బన్ డివిజన్ ఈఈ మునిచంద్ర, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రుణదాతల వేధింపులకు బలి!

అపహరించి తరలిస్తుండగా తెదేపా ఎంపీటీసీ సభ్యుడి మృతి



జగన్నాథరాజు (పాతచిత్రం)

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: ప్రైవేటు రుణదాతలు, ఫైనాన్స్ సంస్థల వేధింపులకు తెదేపా నేత బలయ్యారు. పాలసముద్రం మండలం నరసింహాపురానికి చెందిన తెదేపా ఎంపీటీసీ సభ్యుడు జగన్నాథరాజు(51) అనుమానాస్పద స్థితిలో సోమవారం అర్ధరాత్రి మృతిచెందారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తెదేపా ఎంపీటీసీ సభ్యుడైన జగన్నాథరాజుకు భార్య రాధిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భవన నిర్మాణ, కాలువల తవ్వకం వంటి గుత్తేదారు పనులు, ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాల క్రయవిక్రయాలు చేసేవాడు. ఇటీవల ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన ఓ ప్రైవేటు సంస్థ నుంచి జేసీబీ యంత్రాన్ని అప్పుగా తెచ్చుకున్నాడు. సకాలంలో కంతులు చెల్లించకపోవడంతో సంస్థకు చెందిన పదిమంది రెండు కార్లలో సోమవారం పాలసముద్రంకు వచ్చి అతని ఆచూకీ గురించి విచారించారు. చిత్తూరులో ఉన్నట్లు ఫోన్ ద్వారా వారికి గ్రామస్థులు తెలిపారు. జగన్నాథరాజు పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై జేసీబీ డ్రైవర్ శంకర్‌తో కలిసి పాలసముద్రంకు సోమవారం రాత్రి బయలుదేరాడు. జీడీనెల్లూరు మండల పరిధి అంబోధరపల్లె సమీపంలో నూజివీడుకు చెందిన సంస్థ బృందం పదిమంది ద్విచక్రవాహనాన్ని ఆపి, కారులో జగన్నాథరాజును కిడ్నాప్ చేశారు. ఈ విషయాన్ని శంకర్ జగన్నాథరాజు కుటుంబీకులకు వివరించారు. సోమవారం అర్ధరాత్రి జగన్నాథరాజు కారులో నూజివీడు సమీపంలో గుండెపోటుతో మృతిచెందినట్లు కిడ్నాపర్లు కుటుంబీకులకు ఫోన్‌లో చెప్పారు. శంకర్ ఫిర్యాదు మేరకు జీడీనెల్లూరు సీఐ లక్ష్మీనారాయణ నూజివీడుకు చెందిన కిడ్నాపర్లు వీరేశ్, శివ, మణి, చంద్ర, నాగరాజుతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. జగన్నాథరాజు కుటుంబసభ్యులతో కలిసి జీడీనెల్లూరు పోలీసులు మంగళవారం రాత్రి నూజివీడు బయలుదేరారు. మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తామని సీఐ లక్ష్మీనారాయణ అన్నారు.

కొట్టి చంపి ఉంటారు: కుటుంబసభ్యులు

ఆరోగ్యంగా ఉన్న జగన్నాథరాజు గుండెపోటుతో మృతిచెందే అవకాశం లేదని కుటుంబసభ్యులు, గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జేసీబీ ఫైనాన్స్‌కు చెందిన వారే అతన్ని కొట్టి చంపి ఉంటారని ఆరోపిస్తున్నారు. కంతులు చెల్లించడం ఆలస్యం అయినంత మాత్రాన కిడ్నాప్ చేసి చంపడం దారుణమన్నారు. ఘటనపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. జగన్నాథరాజు మృతికి అధికార పార్టీ నేతలతోపాటు అఖిలపక్ష నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కల్లూరు: పాఠశాలలో మౌలిక వసతులతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టరు సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి ఉపాధ్యాయులతో సమీక్షించారు. విద్యార్థులకు ఉపయోగించే నీటి ట్యాంకులను వారం రోజుల్లో శుభ్రం చేయాలని ఎంపీడీవో రాజశేఖర్‌బాబును ఆదేశించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి దీర్ఘకాలికంగా గైర్హాజరైన విద్యార్థుల వివరాలపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, పారిశుద్ధ్య కార్మికుల జీతాల పెండింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు కింద చేపట్టిన పనులను పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణిని ఆదేశించారు. అసంపూర్తి ప్రహరీ పూర్తికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మతుకువారిపల్లె సమీపంలో చేపట్టిన పులే బీసీ బాలికల గురుకుల పాఠశాల నిర్మాణాన్ని పరిశీలించారు. ఎస్ఎంసీ ఛైర్మన్ ఎస్.అష్రాఫ్, ఎంఈవోలు సిద్ధరామయ్య, తాతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం అక్రమాలపై సీఐడీ కూపీ

- మూడు డిస్టిలరీలపై ఏకకాలంలో దాడులు
- వైకాపాలో నంబరు- 2 నేత కుమారుడి పాత్రపై చర్చ

ఈనాడు, చిత్తూరు, న్యూస్‌టుడే, కుప్పం పట్టణం : వైకాపా హయాంలో జరిగిన మద్యం అక్రమాలపై సీఐడీ కూపీ లాగుతోంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఉదయమే తిరుపతి డీఎస్పీ పద్మలత ఆధ్వర్యంలోని బృందాలు జిల్లాలో మూడు డిస్టిలరీలలో తనిఖీలు చేశాయి. చిత్తూరు నగరం తిమ్మసముద్రంలోని శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, గుడిపాల మండలం పానాటూరు పంచాయతీలోని మోహన్ బ్రేవరీస్ డిస్టిలరీ లిమిటెడ్ (ఎంబీడీఎల్), కుప్పంలోని కాడూస్ (వాంటేజ్ డిస్టలరీ యూనిట్)లో 2019- 2024 మధ్య జరిగిన లావాదేవీలకు సంబంధించిన దస్త్రాలు పరిశీలించారు. రెండు నెలల క్రితమే శ్రీకృష్ణ డిస్టిలరీలో మద్యం నాణ్యతను పరిశీలించేందుకు నమూనాలు తీసుకెళ్లారు. గతంలో ఇది మాజీ ఎంపీ ఆదికేశవుల నాయుడు కుటుంబం చేతుల్లో ఉండగా ఏడెనిమిదేళ్ల కిందట ముంబయి సంస్థతో లీజు ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. వైకాపా హయాంలో ఇది ఆ పార్టీలో నంబరు 2 నేత కుమారుడి చేతుల్లోకి వెళ్లిందని సమాచారం. ఈ క్రమంలోనే అక్రమాల్లో ఆయనకూ పాత్ర ఉందా? అని చర్చ జరుగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనూ అధికార బలంతో ఓ సంస్థను చేజిక్కించుకుని 'జే బ్రాండ్లు' ఉత్పత్తి చేసినట్లు ఇప్పటికే సీఐడీ గుర్తించింది. చిత్తూరులోనూ ఏయే బ్రాండ్లు తయారు చేశారు? ఉత్పత్తి అయిన వాటిలో ఏపీ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీఎల్)కు ఎంత పంపారు? అని సీఐడీ అధికారులు ఆరా తీశారని తెలుస్తోంది.



దళవాయికొత్తపల్లెలోని వాంటేజ్ డిస్టలరీ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

గుడిపాల మండలంలోని ఎంబీడీఎల్‌లోనూ గత ప్రభుత్వంలో జరిగిన లావాదేవీలపై కూపీ లాగారు. 2019లో జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కొంతకాలం వరకు కుప్పంలోని కాడూస్ యూనిట్ కార్యకలాపాలు నిలిచినట్లు స్థానికులు చెబుతున్నారు. తర్వాత తెర వెనుక ఏం జరిగిందో కానీ ఉత్పత్తి మొదలైంది. ఏపీఎస్‌బీసీఎల్ నుంచి ఆర్డర్లు కూడా వచ్చాయి. 'ముఖ్య'నేతకు సన్నిహితుడికి ఇందులో ప్రమేయం ఉందని సమాచారం. కాగా సీఐడీ తనిఖీల విషయమై డీఎస్పీ పద్మలత, అధికారులు నోరు మెదపడం లేదు.

విధుల్లో నిర్లక్ష్యం వీడండి

సిబ్బంది సమాధానాలపై ఆగ్రహం


గుడిపల్లెలో సమీక్షా సమావేశంలో జిల్లా తాగునీటి సరఫరా విభాగం ఎస్ఈ విజయ్‌కుమార్

గుడుపల్లె, న్యూస్‌టుడే: ఇప్పటికే విధులు నిర్వహించే సభలాలో పనులు చేపడితే అను కున్న లక్ష్యాన్ని చేరుకోగల మని జిల్లా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం విభాగం ఎస్ఈ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలోని మండలాల్లో గ్రామీణ తాగునీటి సరఫరా, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులపై ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. తాగునీటి సమస్యలు తలెత్తిన వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ట్యాంకర్లతో సరఫరా విషయమై ఓ ఇంజినీరింగ్ సహాయకుడిని ప్రశ్నించగా సమాధానం చెప్పలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారుల బాతాలను నిధులు జమ అయ్యేలా చూడాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో వ్యక్తిగత మరుగుదొడ్ల పనులు వేగవంతం చేసేందుకు వారంలో ఒరోజు కుప్పంలో పర్యవేక్షించి సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. కుప్పం డీఈఈ పురుషోత్తం, ఏఈఈ హేమలత పాల్గొన్నారు.


నంద్యాలకు ప్రయాణమైన ఆటగాళ్లు

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల పయనం

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-14 కత్తిసాము(ఫెన్సింగ్) పోటీల్లో తలపడే జిల్లా జట్లు మంగళవారం నంద్యాల జిల్లాకు ప్రయాణమయ్యాయి. ఈ నెల 23 నుంచి 25 వరకు నంద్యాల డీఎస్ఏ స్టేడియంలో పోటీలు జరుగునున్నాయి. ఆటగాళ్లకు రైలు టికెట్ రుసుమును ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి వసంతవాణి అందజేశారు. పీడీలు రవీంద్రరెడ్డి, దేవ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ అండర్-14 ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

పూతలపట్టు: హ్యాండ్‌బాల్ అండర్-14 ఉమ్మడి జిల్లా జట్టును మంగళవారం పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా కార్యదర్శి వసంతవాణి ప్రకటించారు. చిత్తూరు గ్రామీణ మండలం సిద్ధంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించాల్సి ఉండగా మైదానంలో నీరు నిల్వ ఉండడంతో పూతలపట్టులో నిర్వహించినట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను కలకడ మండలం కోన జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు మనోహర్, పీడీలు రవీంద్రరెడ్డి, కృష్ణ, డిల్లీరాణి, పీఈటీ పాల్గొన్నారు.

బాలుర జట్టు: గోవర్ధన్‌నాయక్, వసంతకుమార్, చైతన్య (గురుకుల పాఠశాల, పి.కొత్తకోట), సాయినాథ్, పాయాజ్(జడ్పీ ఉన్నత పాఠశాల, కోన), యువరాజ్, కార్తికేయరాజు(జడ్పీ ఉన్నత పాఠశాల, వెంబకం), గణేష్, గిరిధర్(జడ్పీ ఉన్నత పాఠశాల, చెరుకువారిపల్లె), లోకేష్‌నాయక్, ఓం ప్రకాష్(ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల, గ్యారంపల్లె), జీవన్‌తేజ (జడ్పీ ఉన్నత పాఠశాల, సీటీఎం), గౌతమ్(జడ్పీ ఉన్నత, ఎల్లంపాడు), చైతన్య(జడ్పీ ఉన్నత, పూతలపట్టు), సునీల్(జడ్పీ ఉన్నత, సిద్ధంపల్లె), శశాంక్(మదనపల్లె).

బాలికల జట్టు: జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని కావ్య, మౌనిక(రంగంపేట), సఫీయ, కీర్తన(ఈడిగపల్లె), నిహారిక, అర్చన(చెరుకువారిపల్లె), పావని ప్రియ(సీటీఎం), జయనబ్‌ఖాన్, మోషిత(కోన), శ్రీలేఖ(మదనపల్లె), దీక్షిత(జి. కొత్తపల్లె), అమృత(గొల్లపల్లె), జాయిప్రియ, నిహిత(పూతలపట్టు), పూజ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాకాల).

వన్యప్రాణులపై కిరాతకం

- అభయారణ్యంలో శ్రుతిమించిన వేట
- క్రూరమృగాలూ కడతేర్చుతున్న వైనం
- విద్యుత్తు ఉచ్చులు, నాటు తుపాకులకు బలి


నాటు తుపాకీతో వేటకు వెళ్లి వస్తున్న నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు (పాతచిత్రం)

బైరెడ్డిపల్లె, గుడుపల్లె, న్యూస్‌టుడే: వన్యప్రాణులకు రక్షణ కరవైంది. ఉచ్చులకు చిక్కి.. కొన్ని.. నాటుతుపాకీ మరికొన్ని బలవుతున్నాయి. నాటు బాంబులకు అడవి పందులు, ఇతర జంతువులు ప్రాణాలొదులుతున్నాయి. క్రూరమృగాలైన ఏనుగులు, పులులను సైతం వేటాడి సొమ్ము చేసుకుంటున్నారు. బంగారుపాళ్యం నుంచి కుప్పం వరకు విస్తరించిన కౌండిన్య అభయారణ్యంతోపాటు అటవీ సరిహద్దులో ప్రాంతాల్లోనూ వాటి రోదన నిత్యకృత్యమైంది.

మాంసానికి గిరాకీ పెరగడంతో..

పొట్టేళ్లు, మేక మాంసం, నాటుకోళ్ల ధరలు పెరగడంతో అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వన్యప్రాణుల వేట నిత్యకృత్యంగా మారింది. వన్యప్రాణులను వివిధ రకాలుగా వేటాడి చంపేస్తున్నారు. అటవీ సరిహద్దుల్లోని వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్తు తీగలు అమర్చి జంతువులను చంపడం, నాటు తుపాకీతో కాల్చడం, అడవి పందుల కోసం నాటు బాంబులు ఎరగా వేయడం చేస్తున్నారు. ఇలా పలు రకాలుగా వధించిన వన్యప్రాణుల మాంసాన్ని ముక్కలు చేసి విక్రయిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో కొందరు ఇదే వృత్తిగా ఎంచుకుని నిత్యం అడవి జంతువులను కిరాతకంగా చంపేస్తున్నారు.

మూగజీవాలు బలి

వేటగాళ్ల ఉచ్చుకు వన్యప్రాణులే కాకుండా మను షులు, మూగజీవులు బలైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. నాటు తుపాకీతో జంతువులను వేటాడే క్రమంలో.. విద్యుత్తు తీగల ఉచ్చులో అడవి జంతువులతోపాటు మనుషులు ప్రాణాలు కోల్పోతున్నారు. అడవి పందులకు ఎరగా వేసిన నాటుబాంబులను పాడి ఆవులు కొరకడం, తొక్కివేసిన సమయంలో అవి పేలిపోయి మృతిచెందడం, నోటి భాగం పేలిపోయి ప్రాణాలతో పోరాటం చేయాల్సి వస్తోంది.


సోమల మండలంలో రెండ్రోజుల కిందట మృతిచెందిన చిరుత


గుడుపల్లె మండలం చింతరపాళ్యంలో నాటు బాంబు పేలి మృతిచెందిన పెంపుడు శునకం

అరకొరగానే నిందితుల అరెస్టు..

ఇటీవల బైరెడ్డిపల్లె మండలం నెల్లిపట్ల అటవీ ప్రాంతంలో మాంసం కోసం నాటుతుపాకీతో వన్యప్రాణుల వేటకు వెళ్లి తిరిగి వస్తున్న ఇద్దరు నిందితులు, రామసముద్రంలో ఆగస్టు 25న నాటుతుపాకీతో వేటకు వెళ్లిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. లైసెన్సులు లేకుండా నాటు తుపాకుల కలిగిన ఉన్నవారి వందల సంఖ్యలో ఉన్నా అరకొరగానే కేసులు నమోదు చేశారు.

వేటాడితే కఠిన చర్యలు

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవు. ఇటీవల రెండు చిరుతలు విద్యుత్తు తీగల ఉచ్చులో పడి మృతిచెందాయి. పొలాల వద్ద నియంత్రిక నుంచి తీగలు లాగి ఉచ్చు ఏర్పాటు చేసే రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. నాటు తుపాకులు, బాంబులతో వన్యప్రాణులను వేటాడే వారిపైనా చర్యలు తీసుకుంటాం. - భరణి, డీఎఫ్‌వో, చిత్తూరు

కొన్ని ఘటనలు పరిశీలిస్తే..

ఈనెల 21న యాదమరి మండలం తాళ్లమడుగు అటవీ ప్రాంతంలో చిరుతపులి గోర్లను కత్తిరించుకెళ్లడంతో ఇది వేటగాళ్ల పనిగా అనుమానం వ్యక్తమవుతోంది. ఇదే రోజు సోమల మండలం గట్టువారిపల్లె సమీపంలోనూ చిరుతపులి అనుమానాస్పదంగా మృతి చెందింది.

- వి.కోట మండలం నాగిరెడ్డిపల్లె వద్ద ఏడాది కిందట అడవి పందుల నుంచి పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగల ఉచ్చులో ఏనుగు ప్రాణాలొదిలింది.
- రామకుప్పం మండలం 89 పెద్దూరు అటవీ ప్రాంతంలో ఏడాదిన్నరగా పలు ఘటనలు జరగ్గా ఆలస్యంగా వెలుగుచూశాయి.
- 89 పెద్దూరు వద్ద ఫిబ్రవరిలో నాటుబాంబు పేలి ఓ రైతుకు చెందిన పాడి ఆవు ప్రాణాలు వదిలింది. ఏడాది కిందట ఇక్కడే ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు అటవీ ప్రాంతంలో కుళ్లిపోయిన ఏనుగు కళేబరం, చిరుతపులి చర్మాన్ని అటవీశాఖాధికారులు గుర్తించి పంచనామా నిర్వహించారు.
- పెద్దపంజాణి మండలం కోగిలేరు సమీపంలో అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన పాడిఆవు నాటుబాంబును కొరికి మూతిభాగం పేలిపోయి మృత్యువాత పడింది.
- గుడుపల్లె మండలం చింతరపాళ్యంలో 2024 ఏప్రిల్‌లో నాటుబాంబును కొరికి పెంపుడు శునకం మృతిచెందింది. సంగనపల్లె, బిసానత్తం, పెద్దగొల్లపల్లె సమీప అటవీ ప్రాంతంలో పలువురి పాడి ఆవులు ప్రాణాలు విడిచాయి.

చిరుత మృతిపై కొనసాగుతున్న విచారణ

అటవీశాఖ అదుపులో నిందితుడు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: యాదమరి మండలం తాళ్లమడుగు అటవీ ప్రాంతంలో చిరుత మృతి ఘటనపై అటవీశాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. చిరుత కళేబరాన్ని పోస్టుమార్టం చేసిన తిరుపతి ఎస్వీ జూ వైద్యాధికారులు చిరుత ఎలా మృతి చెందిందని స్పష్టం చేసినా, ఆ రిపోర్టును అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే తాళ్లమడుగు సమీపంలో చిరుత మృతి చెందిన ప్రాంతంలో అనుమానితుడిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగల షాక్‌తోనే చిరుత మృతిచెందిన్నట్లు కోణంలో విచారణ సాగుతోంది. సంఘటన స్థలానికి పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ తీగలు అమర్చడాన్ని గుర్తించినట్లు ఇదివరకే డీఎఫ్‌వో భరణి స్పష్టం చేశారు. చిరుత ఒకచోట మృతి చెందగా, మరోచోట అటవీ ప్రాంతంలో పడేసినట్లు అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వైద్యులు ఇచ్చిన స్పష్టత ఆధారంగా విచారణ ప్రారంభించిన అటవీశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పలువురిని విచారిస్తున్నారు. చిరుత ఎలా మృతి చెందింది. అందుకు గల కారణాలు, నిందితుల వివరాలను ఆ శాఖ అధికారులు వెల్లడించాల్సి ఉంది.

చెక్‌పోస్టుల బలోపేతానికి ప్రణాళికలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: మార్కెట్ కమిటీల చెక్‌పోస్టులు బలోపేతానికి పటిష్ఠ ప్రణాళికలు సిద్ధం చేయాలని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంచాలకులు(జేడీ)రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షించారు. మార్కెట్ కమిటీల్లో ఆక్రమాల అడ్డుకట్ట, ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యేక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేశామని, వీరి చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేస్తారన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల ఏడీలు పరమేశ్వరన్, సురేంద్ర, కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ నిధులు మంజూరు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలోని పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలు, కేజీబీవీలు, జూనియర్ కళాశాలలు తదితర వాటికి రూ.5.32 కోట్లు మంజూరైనట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మంగళవారం తెలిపారు. పీఎంశ్రీ కింద జిల్లాలో 2,396 పాఠశాలలు, కళాశాలలు ఎంపికయ్యాయని చెప్పారు. నిధుల్లో 50 శాతం రూ.2.66 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లాలోని మండల వనరుల కేంద్రాల(ఎంఆర్సీ) నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం రూ.40.30 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. జిల్లాలో 31 ఎంఆర్సీలు ఉండగా ఒక్కో కేంద్రానికి రూ.1.30 లక్షలు కేటాయించిందని పేర్కొన్నారు.

అధోగతే తప్ప.. అభివృద్ధేదీ?

- అసంపూర్తి పనులు ఆపేయండి
- మార్కెటింగ్ శాఖకు ప్రభుత్వం ఉత్తర్వులు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం మార్కెట్ కమిటీలు నిర్వహణను విస్మరించి నిర్వీర్యం చేసింది. పంట ఉత్పత్తుల నుంచి సెస్ వసూళ్లే తప్ప.. అభివృద్ధి పనులను గాలికొదిలేసింది. మార్కెట్ కమిటీల అభివృద్ధి పనుల పేరుతో ప్రతిపాదనలు, మంజూరుతో సరి.. పనుల నిర్వహణ జరిగిందే లేదు. చేపట్టిన పనులు కొన్ని వివిధ దశలో ఉండగా మరికొన్ని ప్రారంభమే కాలేదు. మార్కెటింగ్ శాఖలో అభివృద్ధి పనులు 25 శాతం లోపే ప్రగతి ఉంటే వెంటనే ఆపేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుత్తేదారులతో నిర్దేశిత ఒప్పందం జరిగిన అనంతరం భౌతికంగా పాతిక శాతం లోపే చేసిన వాటిని తక్షణమే గుర్తించి నివేదించాలని.. ఇప్పటికే మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు జిల్లా ఇంజినీర్లకు ఆదేశించారు.

రూ.2.10 కోట్ల పనుల రద్దు

జిల్లాలోని పలు మార్కెట్ కమిటీల్లో పనులు మొదలు కాని, అసంతృప్తిగా ఆగిపోయిన సుమారు రూ.2.10 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు రద్దయ్యాయి. పలమనేరు మార్కెట్ కమిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులు, ఎస్‌ఆర్‌పురం, నగరి మార్కెట్ కమిటీలకు నూతన కార్యాలయ భవన నిర్మాణాలు, బంగారుపాళ్యం, బీఎన్‌కండ్రిగ, చిత్తూరు కమిటీలతో పాటు పలు కమిటీల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఆగిపోయాయి.

సత్వరమే ప్రతిపాదనలు

కమిటీల వారీగా రైతుల అవసరాలు, ఆత్యవసర పనులకు సత్వరమే వ్యయ అంచనా ప్రతిపాదనలు పంపాలని ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు జారీ చేశాం. రద్దయిన పనులు కూడా అవసరాలకు అనుగుణంగా తాజా వ్యయ అంచనాలతో కొత్తగా పనులు మంజూరు చేసి పూర్తి చేస్తాం.

- రామాంజనేయులు, జేడీ, మార్కెటింగ్ శాఖ

తవణంపల్లెలో 103.4 మి.మీ వర్షం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సోమవారం రాత్రి జిల్లాలోని 18 మండలాల్లో భారీ నుంచి తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా తవణంపల్లె మండలంలో 103.4 మి.మీటర్ల వర్షం కురవగా.. అత్యల్పంగా పెనుమూరు 0.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. సోమల మండలంలో 67.0 మి.మీటర్లు, పూతలపట్టు 24.4, చౌడేపల్లె 19.6, శాంతిపురం 14.6, సదుం 14.2, పెద్దపంజాణి 12.6, చిత్తూరు 12.0, బైరెడ్డిపల్లె 11.0, యాదమరి మండలంలో 10.0 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

వెంకాబ్ కోళ్ల ధరలు	
బ్రాయిలర్ (రైతు ధర)	122
రిటైల్	144
లేయర్	115
బ్రాయిలర్స్	209
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	238
లేయర్ మాంసం	195

నేడు విద్యుత్తు సమస్యలపై వినతుల స్వీకరణ

చిత్తూరు(మిట్టూరు) : జిల్లా పరిధిలోని విద్యుత్తు శాఖ డివిజన్, సబ్-డివిజన్ కార్యాలయాల్లో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతులు స్వీకరించనున్నామని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. చిత్తూరు అర్బన్ డివిజన్‌కు సంబంధించి స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ, సబ్-డివిజన్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తామని ఈఈ మునిచంద్ర తెలిపారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి

బైరెడ్డిపల్లె: మండల పరిధిలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కామినాయనిపల్లె సమీపంలో వ్యవసాయ పొలాల వద్ద రైతు సుబ్రహ్మణ్యంకు చెందిన రూ.92 వేలు విలువైన పాడి ఆవుపై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు మృతితో రైతు జీవనోపాధిని కోల్పోయాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

నాలుగు నాటు తుపాకులు స్వాధీనం: ముగ్గురి అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు


కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలం మంగళంపేట రిజర్వు ఫారెస్టు సమీపంలోని ఎలకదోని పెంట వద్ద ఓ మామిడి తోటలో మంగళవారం వేకువ జామున అక్రమంగా ఉన్న నాలుగు నాటు తుపాకులను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఎస్సై వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఎలకదోనిపెంట వద్ద ఉన్న పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసభ్యుల పేరిట ఉన్న మామిడి తోటలో నివాసం ఉంటున్న సోమల మండలానికి చెందిన రెడ్డమ్మ, గంగులయ్య, భాగ్యమ్మ ఇళ్లల్లో తనిఖీలు చేశారు. తనిఖీల్లో అక్రమంగా ఉంచిన నాలుగు నాటు తుపాకులను పోలీసులు గుర్తించారు. తుపాకులు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. రవి అనే వ్యక్తి పరారైనట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.


నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

రూ.175 కోట్లతో నీవా నది రిటైనింగ్ వాల్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వర్షాలు కురిసినప్పుడల్లా నీవా నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించడానికి రూ.175 కోట్లతో నీవా నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించడానికి అంచనాలు రూపొందించి సీఎం చంద్రబాబుకు విన్నవించినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని నీవా నది పరివాహక ప్రాంతాలైన తేనెబండ, విరభద్రకాలనీ, వీరభద్ర ఆలయం, సంతపేట లిల్లీ బ్రిడ్జి, కట్టమంచి రిక్షా కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. కల్వర్టులు, వంతెనలను, పూడికతీత పనులను పరిశీలించారు. స్థానిక ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సంతపేట మీసేవా కేంద్రం వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా, చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తమ కుటుంబానికి జీవనాధారం చూపాలని ఓ ముస్లిం కుటుంబం కోరగా, ఎమ్మెల్యే వారికి ఓ మిఠాయి దుకాణం నడిపేందుకు వీలుగా చక్రాల బండిని అందించారు. మేయర్ అముద, ఉప మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నగరపాలక సహాయ కమిషనరు అవినేని ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

తల్లి, కుమారుడి మృతితో తెట్టుపల్లెలో విషాదం


ఫకీరాబీ, నూరుల్లా (పాతచిత్రాలు)

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లిమంద పంచాయతీ తెట్టుపల్లెకు చెందిన ఫకీరాబీ, కుమారుడు నూరుల్లా ఇద్దరు బంధువుల చనిపోవడంతో సోమవారం అన్నమయ్య జిల్లాలోని ఓ గ్రామానికి వెళ్లారు. అంత్యక్రియల అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కలకడ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద ప్రైవేటు బస్సు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఫకీరాబీ(65), ఆమె కుమారుడు నూరుల్లా(40) దుర్మరణం చెందారు. తల్లి, కుమారుల మృతదేహాలను మంగళవారం తెట్టుపల్లెకు తీసుకురావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బతుకుతెరువుకోసం గల్ఫ్ దేశంలో ఉన్న నూరుల్లా భార్య మరిమా వచ్చి మృతదేహాలను చూసే వరకు ఇద్దరి మృతదేహాలను తెట్టుపల్లె మసీదులో ఉంచారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు సమీర, హనీషా ఉన్నారు. పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ కుసుమ మోహన్, నాగేశ్వరరావు, సర్పంచి చంద్రకళ మృతదేహాలను సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

కంటైనర్ ఢీకొని మహిళ దుర్మరణం

గంగవరం, న్యూస్‌టుడే: బెంగళూరు, చెన్నై జాతీయ రహదారిలో నాలుగు రోడ్లు కూడలి సమీపంలో మంగళవారం రాత్రి కంటైనర్ ఢీకొని గుర్తు తెలియని మహిళ(50) మృతి చెందింది. సీఐ ప్రసాద్ కథనం మేరకు.. చెన్నై వైపు నుంచి బెంగళూరు వెళుతున్న కంటైనర్ రోడ్డు పక్కన వెళుతున్న గుర్తు తెలియని మహిళను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఏనుగుల దాడిలో వరి, రాతి స్తంభాలు ధ్వంసం

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లెలోని వ్యవసాయ పొలంలో కల్లూరుకు చెందిన సయ్యద్ బాషా రెండు ఎకరాల వరి పంట సాగు చేశాడు. వరి పంటపై పడ్డ ఏనుగుల గుంపు పూర్తిగా తొక్కి నాశనం చేశాయి. కల్లూరు కట్టకిందపల్లెకు చెందిన కేశవులునాయుడుకు చెందిన అర ఎకరా వరి పంటను ధ్వంసం చేశాయి. కొంగరవారిపల్లెకు చెందిన రైతు సురేంద్రనాయుడు మామిడి తోటకు ఉన్న ఇనుప ముళ్ల కంచెను కూల్చి వేశాయి.

ఎంపీ మిథున్‌రెడ్డి బెయిలు పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈ నెల 29న నిర్ణయం వెల్లడిస్తామన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: పుంగనూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో ముందస్తు బెయిలు కోసం రాజంపేట వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, మరికొందరు దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఈనెల 29 న నిర్ణయాన్ని వెల్లడిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే.కృపాసాగర్ ప్రకటించారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన నేతిగుట్లపల్లి, ఆవులపల్లి రిజర్వాయర్ల కోసం సేకరించిన భూముల పరిహారం విషయమై వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన తమపై ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు దాడి చేశారని ఏఎస్ఆర్‌కే.ప్రసాద్, సొహైల్ బాషా ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పుంగనూరు పట్టణ పోలీసులు పలువురిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. వాటిలో ముందస్తు బెయిలు కోసం మిథున్‌రెడ్డి, మరికొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఎంపీ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్‌పై తెదేపా కార్యకర్తలు దాడి చేసి తిరిగి ఆయనపైనే తప్పుడు ఫిర్యాదు ఇచ్చారన్నారు. రాజకీయ కారణాలతో పోలీసులు కేసులు నమోదు చేశారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు బెయిలు ఇవ్వాలని కోరారు.

- పోలీసుల తరఫున అదనపు పీపీ మర్రి వెంకటరమణ వాదనలు వినిపించారు. పుంగనూరు వెళితే శాంతిభద్రతలకు విఘాతం అని పోలీసులు హెచ్చరించినా ఎంపీ పట్టించుకోలేదన్నారు. దాడులు చేయాలన్న ఉద్దేశంతో ఆయన అనుచరులతో పుంగనూరు వెళ్లారన్నారు. అక్కడికి వెళ్లకుంటే నేర ఘటన జరిగేది కాదని వివరించారు. ఈ దాడుల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఎంపీపై ఇదే తరహా కేసులు ఏడు ఉన్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. బెయిలు పిటిషన్లను కొట్టేయాలని కోరారు.

చిత్తూరు

సామాన్యులకు అందుబాటులో ఇసుక

విజయపురం, న్యూస్‌టుడే: సామాన్యులకు అందుబాటులో ఇసుక సరఫరా చేస్తున్నామని తహసీల్దారు కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని 25 పంచాయతీలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కేవీశ్రీరామపురంలోని కుశస్థలి నది వద్ద ఇసుక రీచ్‌ను గుర్తించామని అనుమతితోనే సామాన్యులకు సైతం ఇసుక పంపిణీ చేస్తున్నామన్నారు.

లైసెన్స్ ఉన్నవారే టపాసుల విక్రయించాలి

నగరి, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా పట్టణంలో లైసెన్స్ ఉన్నవారు మాత్రమే టపాసులు విక్రయించాలని నగరి సీఐ మహేశ్వర్ తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న దుకాణాలను తనిఖీ చేసి రూ.7వేలు విలువైన టపాసులు స్వాధీనం చేసుకున్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం తెదేపా జిల్లా కార్యాలయంలో పూతలపట్టు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. తెదేపా సభ్యత్వ నమోదు ప్రక్రియ విధానంపై నాయకులు, కార్యకర్తలకు సలహాలు సూచనలు చేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి జరిగే సభ్యత్వ నమోదును నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. ఆ పార్టీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, పూతలపట్టు, యాదమరి, ఐరాల, తవణం పల్లి మండలాల అధ్యక్షులు దొరబాబుచౌదరి, మురళీయాదవ్, గిరిధర్‌బాబు, దిలీప్‌కుమార్, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ చౌదరి, నాయకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రతిభకు పదును

విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాలల్లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించడం అభినందనీయమని వేదవ్యాస విద్యానికేతన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల కరస్పాండెంట్ బాలసరస్వతి పేర్కొన్నారు. పుత్తూరులోని వేదవ్యాస విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ప్రతిభా పోటీల్లో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలు ధన్యశ్రీ, గీతామాధురి, యశస్వినిలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కవిమణి, ఉపాధ్యాయులు రూప, బాలాజీ, శంకర్‌కుమార్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పుత్తూరు



బహుమతులందుకున్న విజేతలతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

పోటీ పరీక్షలతో విజ్ఞానం పెంపు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా వారిలో విజ్ఞానం పెంపొందించుకోవచ్చునని గిరింపేట కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని గిరింపేట కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీ పరీక్ష నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషియల్ మీడియా ప్రభావం' అంశంపై ఎనిమిది, తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా చక్కగా రాశారు. హర్షిత, శిరీషా, శాంత వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ ప్రశంసా పత్రంతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరుకు వీధులు.. జీవనానికి అవస్థలు

- సందుల్లోనే ఏళ్ల తరబడి నివాసం
- అత్యవసర సమయాల్లో తప్పని సమస్య

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ఎప్పుడో తాతల కాలం నాటి ఇరుకు సందులు. ద్విచక్రవాహనాలు తప్పితే.. నాలుగు చక్రాల వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ప్రణాళిక లేకుండా నగరంలో ఇష్టారాజ్యంగా భవనాలు నిర్మించడం దీనికి ప్రధాన కారణం. పట్టణ ప్రణాళిక ప్రకారం ఒక్కో వీధిలో 40 అడుగుల రోడ్డు ఉండాలి. అతర్గత వీధుల్లో కనీసం 20 అడుగుల వెడల్పుకు తగ్గకూడదు. అయితే నగరంలో అయిదు నుంచి పది అడుగుల వెడల్పుతో ఉన్న వీధులు కోకొల్లలు. ఈ రోడ్లలో అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనాలు సైతం వెళ్లలేని దుస్థితి.

❖ వందేళ్ల చరిత్ర కలిగిన నగరంలో దాదాపు 40 వేలకు పైగా భవనాలు, ఇళ్లు ఉండగా.. వీటిలో 70 శాతం వరకు భవనాలకు ప్రణాళిక అనుమతి (ప్లాన్ అప్రూవల్) లేదు. మూడు, నాలుగు దశాబ్దాల కిందట ఉన్న నిబంధనలను ఇళ్లకు నగరపాలక సంస్థ నుంచి ప్రణాళిక అనుమతి తీసుకున్న దాఖలాల్లేవు. ఇదే నగరానికి శాపంగా పరిణమించింది. గతంలో నగర విస్తరణ అవకాశాలు తక్కువగా ఉండటంతో ఉన్న స్థలాల్లోనే ఇబ్బడిముబ్బడిగా ఇళ్లను నిర్మించారు. ఇళ్ల మధ్య కనీసం రహదారి కోసం ఎంత వదిలి పెట్టాలో తెలియకుండా నిర్మాణాలు చేపట్టారు. నగరంలోని దాదాపు సగభాగం వీధుల్లో కేవలం పది నుంచి 15 అడుగుల రహదారే ఉంటోంది. పురపాలక సంఘంగా ఉన్న చిత్తూరు పట్టణం 2012లో నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ అయ్యింది. నగర శివారుల్లోని 14 గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ నగరపాలక సంస్థగా మార్పు చేశారు. నగరంలో దాదాపు 400కి పైగా వీధులు ఉండగా..వీటిలో 70 శాతం వరకు వీధుల్లో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

- పురపాలక సంఘం ఏర్పాటు: 1917
- మొత్తం డివిజన్లు: 50
- నగర విస్తీర్ణం 95.97 చదరపు కిలోమీటర్లు
- జనాభా: 2.22 లక్షలు (అంచనా)
- కుటుంబాలు: 55 వేలు



శివాలయం వీధిలో అయిదు అడుగుల రహదారి



కయినికట్టువీధిలో రోడ్డుపైనే మెట్ల నిర్మాణం

వీధుల్లో వాహనాల నిలిపివేత

నగరంలో దాదాపు పది వేలకు పైగా వాహనాలు ద్విచక్ర, మూడు, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నట్లు అంచనా. సింహభాగం వాహనాల పార్కింగ్ వీధుల్లోనే ఉంటోంది. మొత్తం నోటిఫైడ్ మురికివాడలు 73, నాన్ నోటిఫైడ్ 5 వరకు ఉండగా.. ఈ ప్రాంతాలు అత్యంత ఇరుకుగా ఉన్నాయి. ఆపత్కాలంలో అత్యవసర సర్వీసుల వాహనాలు ఈ వీధుల్లోకి వెళ్లలేవు. నగరంలోని బజారువీధిని అనుకుని ఉన్న చావడి, ఆషార, గుర్రప్ప, వన్నీయర్‌బ్లాక్, పాత పూలమార్కెట్, పాత బందేఖానా, బ్రాహ్మణవీధి తదితర వీధుల్లో 90శాతం వరకు ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని దుస్థితి ఉంది. ఆస్పత్రులు, మెడికల్ దుకాణాలు ఎక్కువగా ఉన్న సుందరయ్యర్‌వీధి ఇరుకుగా ఉండటంతో.. ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రవేశించాయంటే..ట్రాఫిక్ మొత్తం ఆగిపోవాల్సిందే. కొండమిట్టలోని చామంతిపురం, వినాయకపురం, అశోకపురం వీధుల్లో అత్యంత ఇరుకుగా ఉంటోంది.

కలగా విస్తరణ

కొండ ప్రాంతం కావడంతో దశాబ్దాల కిందట ఇళ్లను నిర్మించుకోవడంతో.. అయిదు అడుగుల రోడ్లే స్థానికులకు దిక్కయ్యాయి. ఎత్తైన ప్రాంతాలైన ఇక్కడ వీధుల్లోనే ఇళ్లకు మెట్లు నిర్మించుకోవడంతో రోడ్లు మరింతగా కుంచించుకుపోయాయి. నీటి ట్యాంకర్లు వెళ్లలేని పరిస్థితి. ఇళ్లకు బంధువులు వస్తే ఆటోల్లో సైతం ఇళ్లకు వద్దకు చేరుకోలేరు. ఇరుకైన వీధుల్లో నగర ప్రజలు దైనందిన జీవితాలను అతి కష్టంమీద నెట్టుకొట్టున్నారు. వీధుల విస్తరణ ప్రక్రియ కలగానే మిగిలిపోతోంది. నగరంలో ప్రధాన రహదారుల్ని మినహాయిస్తే..జనావాసాల ప్రాంతాల్ని ఇరుకు సమస్య ఏళ్ల తరబడి వేధిస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే:

సమస్య: మండల పరిధి దిగువ మెదవాడలో గ్రామం పక్కనే కొందరు కోళ్లఫారాలు నిర్వహించడంతో తీవ్రమైన దుర్వాసన రావడంతోపాటు పారిశుద్ధ్యం లోపిస్తోంది.
-జ్యోతిప్రకాష్, స్థానికులు

సమాధానం: పంచాయతీ అధికారులతో విచారణ చేయించి, చర్యలు తీసుకుంటాం.
-మురళీమోహన్, ఎంపీడీవో



వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

కొట్టుకుపోయిన వంతెన

రాకపోకలకు అంతరాయం

తవణంపల్లి, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం రాత్రి 103.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వరదల ధాటికి అరగొండ-సరకల్లు ప్రధాన రహదారిలో తొడతర వద్ద బహుదా నదిపై నిర్మించిన వంతెన కొట్టుకుపోయింది. తొడతర, చెర్లోపల్లి, వెంగంపల్లి, జి.గొల్లపల్లి, పట్రపల్లి, సరకల్లు గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎమ్మెల్యే మురళీమోహన్ మంగళవారం ఉదయం తొడతర వద్దకు చేరుకుని.. కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. తాత్కాలిక రాకపోకల నిమిత్తం వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారుల్ని ఆదేశించారు. 24 గంటల్లోగా పనులు పూర్తిచేయాలన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫోన్ చేసి పరిస్థితిని తెలియజేశారు. ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రెడ్డిబాబు, మాజీ జడ్పీటీసీ సభ్యులు వెంకటేశ్వర చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, తెదేపా మండల అధ్యక్షుడు దిలీప్, నాయకులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. పుత్తూరు మండలం గొల్లపల్లి సచివాలయం మంగళవారం గ్రామసభ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఐవోఎస్ కృపాకర్, సర్వేయర్ శేషమరాజు, మాజీ ఎంపీటీసీ గజపతి, వెంకటాచలపతి, రైతులు పాల్గొన్నారు. **విజయపురం, న్యూస్‌టుడే:** గత ప్రభుత్వంలో రీ-సర్వేలో నెలకొన్న భూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తహసీల్దారు కిరణ్ పేర్కొన్నారు. ఎల్లసముద్రంలో గ్రామ సభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు అశోక్, మండల సర్వేయర్ శేఖర్, వీఆర్వో మేఘనాథం, సర్పంచి మమత శ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.

పాలసముద్రం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు నగరి ఆర్డీవో వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సింహరాజుపురం పంచాయతీ పరిధిలోని గ్రామంలో రీసర్వే గ్రామసభ తహసీలారు అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామసభలో 15 అర్జీలు అందించారు. **గుడిపాల, న్యూస్‌టుడే:** ముట్టుకూరుపల్లెలో గ్రామసభ నిర్వహించారు. రామభద్రాపురం, శ్రీరంగంపల్లె, 189.కొత్తపల్లె రైతులు సుమారు 35 మంది వివిధ సమస్యలకు సంబంధించి తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి అర్జీలను అందజేశారు.



మాట్లాడుతున్న రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో వెంకట్‌రెడ్డి



రాజేశ్వరమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గల్లా అరుణకుమారి

మృతికి నివాళి

వడమాలపేట, న్యూస్‌టుడే: ఎస్‌బీఆర్‌పురానికి చెందిన సుబ్బులురాజు భార్య రాజేశ్వరమ్మ(71)అమెరికాలో ఇటీవల మృతి చెందారు. మంగళవారం కర్మక్రియల సందర్భంగా మాజీ మంత్రి గల్లా అరుణకుమారి రాజేశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి ధనుంజేయులునాయుడు, నాయకులు పాల్గొన్నారు.

'ప్రజలు హర్షిస్తుంటే.. వైకాపా దుష్ప్రచారం'



సురేంద్రకుమార్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే, మాజీ సీఎం జగన్ సహా వైకాపా నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, దోపిడీ, అవినీతి, రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

నగరి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు శుభాకాంక్షల రూపంలో వచ్చిన నోటు పుస్తకాలను నగరి పురపాలకలోని పలు పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేశారు. తెదేపా పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, రజనీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుదా నదికి హారతి

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం నుంచి ప్రవహిస్తున్న బహుదానదికి మంగళవారం సాయంత్రం ఆలయ ఈవో గురుప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు హారతి ఇచ్చారు. ఆలయం నుంచి సారె, పూజ సామగ్రితో నది వద్దకు వెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, బాలాజీనాయుడు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల పంపిణీ

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మండలంలోని మొగిలి గ్రామానికి చెందిన జ్యోతిష్య పండిత అవార్డు గ్రహీత పాణ్యం శ్రీనివాసశర్మ ఆయన తాత అవ్వలు, తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ఆధ్యాత్మిక నిత్యచంద్రసాధన పుస్తకాలను కంచి పీఠాధిపతి జగద్గురు శంకరవిజయేంద్రసరస్వతి స్వాములవారిచే మంగళవారం అందించినట్లు తెలిపారు.

మొగిలిఘాట్‌లో చెక్‌పోస్టు ఏర్పాటు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: బెంగళూరు-చెన్నై మార్గం మధ్యలోని మొగిలి ఘాట్ రోడ్డులో తరచూ జరుగుతున్న ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు అధికారులు పలు చర్యలు చేపట్టిన విషయం విదితమే. రద్దీగా వాహనాలు వెళ్లే రహదారిలో వేగాన్ని తగ్గించి ప్రమాదాలు నివారించేందుకు దొరచెరువు సమీపంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారని సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఇద్దరు హోంగార్డులు 24గంటలు విధుల్లో ఉంటారని తెలిపారు.

ఆవును తీసుకెళ్లారని ఫిర్యాదు

విజయపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఎల్లసముద్రం ఎస్టీ సెంటర్‌కు చెందిన శాంతమ్మ మంగళవారం తన ఆవును ఎవరో తీసుకెళ్లారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారం క్రితం రూ.55వేలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆవు ఆదివారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రీరాములు నాయుడి సేవలు మరువలేనివి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: ప్రజా సేవలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీరాములు నాయుడి సేవలు మరువలేనివని మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. కార్వేటినగరంలో శ్రీరాములునాయుడి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైకాపా నాయకురాలు కృపాలక్ష్మి, ఎంపీపీ లత, సర్పంచి ధనంజయవర్మ, నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం నిర్వహణ

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన ఆలయ మండపంలో ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. 2025 సంవత్సరం క్యాలెండర్లు, డైరీలు ముద్రించుకుని, విక్రయించుకుని ఐదు నెలల కాలపరిమితి లైసెన్స్ హక్కు కోసం రూ.32.10లక్షలు, లగేజీలు భద్రపరచుకునే లైసెన్స్ ఏడాది కాలపరిమితికి రూ.32.76లక్షలు, షాపు నం 28, 29లో క్యాంటీన్ నిర్వహించుకునేందుకు ఏడాది కాలపరిమితికి రూ.29,17,116లకు వేలం పాట జరిగింది. కార్యక్రమంలో ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, హరి, మాధవరెడ్డి, సూపరింటెండెంట్ బాల రంగస్వామి పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కొత్త విధానం

చిత్తూరు(నేరవార్తలు): నగరంలో రహదారుల్లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు లేకున్నా.. నిబంధనలను అతిక్రమించే వాహనాలకు ఆన్‌లైన్ ద్వారా జరిమానాలు విధించేలా ట్రాఫిక్ పోలీసులు కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రోజూ ఓ కూడలిలో తనిఖీలు చేపడుతుంటే.. మరో కూడలిలో వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తున్నట్లు గుర్తించారు. దీంతో నిఘా నేత్రాల ద్వారా కేసుల నమోదుకు చర్యలు చేపట్టారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మంగళవారం ఫాల్కాన్ వాహనం(సీసీ కెమెరాలు ఉన్న వాహనం)ను ఒక్కో ప్రాంతాల్లో నిలబెట్టి.. ఆ వాహనానికి సుమారు 200 మీటర్ల దూరంలో వాహనదారులు నిబంధనలను అతిక్రమించినా.. జరిమానాలు విధించడం ప్రారంభించారు. 51 కేసులు నమోదు చేసి రూ.53 వేలు జరిమానా విధించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

పుత్తూరు, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతో రక్తహీనత సమస్యను దూరం చేసుకోవచ్చని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం డిగ్రీ చేరిన విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్రం అధ్యాపకులు కోటేశ్వరరావు, పద్మావతి, మైక్రోబయాలజీ అధ్యాపకుడు జయప్రద పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో తనిఖీ

జీడీనెల్లూరు: వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంతో అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా మెలగాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతిదేవి వైద్యసిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆమె తూగుండ్రం ఆరోగ్యకేంద్రాన్ని, బంగారెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.



తూగుండ్రం ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి



రహదారిని ముళ్లకంపలు వేసి మూసి వేసిన దృశ్యం

రహదారి మూసివేత

తవణంపల్లె: అరగొండ, బంగారుపాళ్యం వయా ఎ.గొల్లపల్లి మీదుగా వెళ్లే రహదారిపై అరగొండ సమీపంలో బహుదా నదిపై నిర్మించిన వంతెన దెబ్బతినడంతో తాత్కాలికంగా రహదారిని మూసివేశారు. రహదారికి అడ్డంగా ముళ్లకంచె వేసి ఎర్రబట్ట కట్టారు. ఈ మార్గంలో వెళ్లే ప్రజలు రెడ్డిపల్లె మిట్ట, గాజులపల్లె మీదుగా వెళ్లాలని తెలిపారు. వంతెన దెబ్బతినడంతో వర్షపు నీటి ప్రవాహానికి సమీపంలోని పంటలు దెబ్బతిన్నాయి.

సమన్వయంతో పని చేయండి

చిత్తూరు గ్రామీణ: తెదేపా నాయకులు, కార్యకర్తలు పార్టీ అభ్యున్నతికి సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాయలంలోని ప్రజాదర్బార్ సమావేశ మందిరంలో మంగళవారం చిత్తూరు మండల నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తెదేపా సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. నాయకులు శశికర్‌బాబు, రఘు, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

ఐరాల, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ఐరాల జూనియర్ కళశాల సమీపంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలాన్ని తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎస్సై నరసింహులు మంగళవారం పరిశీలించారు. వీఆర్వో రాధయ్య ఉన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ నయం

జీడీనెల్లూరు: తొలిదశలోనే క్యాన్సర్‌ను గుర్తించి.. వైద్యులను సంప్రదించడంతోనే వ్యాధిని నయం చేసుకోవచ్చని బెంగుళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ శివరాజు అన్నారు. మంగళవారం ఆయన అగరమంగళం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో కాన్సర్‌పై అవగాహన కల్పించారు. రూరల్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జీడీనెల్లూరు: భారీ వర్షాలతో నిండిన కలవకుంట ఎన్టీఆర్ జలాశయం గేట్లు ఎత్తిన దృష్ట్యా మండల పరిధి నీవానది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా మెలగాలని తహసీల్దారు చంద్రశేఖర్ కోరారు. తొలుతగా మండల పరిధిలోకే నీవానది నీటిప్రవాహం సాగుతుందని తెలుసుకోవాలన్నారు.

లారీ బోల్తా... తప్పిన ప్రమాదం

బంగారుపాళ్యం: చిత్తూరు పలమనేరు జాతీయ రహదారిలోని మొగిలిఘాట్ రోడ్డులో మంగళవారం పెనుప్రమాదం తప్పింది. కర్ణాటకలోని వడ్డిపల్లె నుంచి టమోటాలను చెన్నైకి ఐచర్ వాహనంలో తరలిస్తుండగా మొగిలిఘాట్ రోడ్డులో వెనుక వస్తున్న లారీ ఐచర్ వాహనాన్ని ఢీ కొంది. ఐచర్ వాహనం, లారీ బోల్తా పడ్డాయి. సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



భరత్‌రాజ్

పూతలపట్టు, న్యూస్‌టుడే: పూతలపట్టు-కాణిపాకం రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి కిందిపడి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తవణంపల్లె మండలం వెంగంపల్లెకు చెందిన భరత్‌రాజ్(21) ద్విచక్రవాహనంపై బండపల్లె సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చి దర్శనం అనంతరం స్వగ్రామానికి పయనమయ్యారు. పూతలపట్టు సమీపంలోని కాణిపాకం ఆర్చి సమీపంలో వాహనం నుంచి కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. ప్రాథమిక చికిత్స నిమిత్తం 108 వాహనంలో పి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించగా మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని పాదచారికి గాయాలు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: పట్టణ శివారు కడప రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. చిత్తూరు జిల్లా విజయపురం మండలం జంబాడ గ్రామానికి చెందిన నల్లపోగు బాలాజీ రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలాజీని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బరిలో దిగితే పతకాల పంటే

పలు క్రీడల్లో రాణిస్తున్న గ్రామీణ విద్యార్థులు

ఐరాల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో చదువుతూ.. నిత్యం కఠోర శిక్షణ తీసుకొని రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ఇటు పాఠశాలకు.. అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశ కీర్తిని చాటుతామంటున్నారు.. ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు. క్రీడల్లో వారు సాధించిన విజయాలు ఇలా...

దేశ సేవ చేస్తా



మండలంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఆనంద, లలిత కుమార్తె మొగిలీశ్వరి. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. మొగిలీశ్వరి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రుల కష్టం తెలిసి వసతిగృహంలో ఉంటోంది. క్రీడల పట్ల ఆసక్తితో ఫెన్సింగ్ క్రీడను ఎంచుకొంది. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ.. నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించింది. ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయడమే తన కోరికని తెలియజేసింది.

అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనడమే లక్ష్యం



మండలంలోని ఐరాల పంచాయతీ పెద్దగొల్లపల్లెకు చెందిన నరసింహులు, లక్ష్మమ్మల కుమారుడు తులసీరామ్. ప్రస్తుతం ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చదువుకొంటూ క్రీడలతో మంచి ఫలితాలను సాధిస్తున్నాడు. గత సంవత్సరం నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో వ్యక్తిగత విభాగంలో రజతం, గ్రూపు పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించాడు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడమే లక్ష్యమంటున్నాడు.

సివిల్స్ సాధించి ప్రజాసేవ చేస్తా



మండలంలోని గోవిందరెడ్డి పల్లెకు చెందిన శంకర్‌రెడ్డి, చిన్నిల కుమార్తె రమ్య. తండ్రి వ్యవసాయం చేస్తుండగా.. తల్లి గృహిణి. చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని గుర్తించి ఉపాధ్యాయుల సహకారంతో సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్, ఖోఖో పోటీల్లో ప్రావీణ్యం సాధించింది. ఈ క్రమంలో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్నది బాలిక కోరిక. సివిల్ సాధించి ప్రజాసేవ చేయాలంటోంది.

పలమనేరు

●పలమనేరు ● కుప్పం ●పుంగనూరు

ఉచిత వైద్య శిబిరం

రామకుప్పం, న్యూస్‌టుడే: మండలంలోని ఆరిమానుపెంటలో మంగళవారం ఉదయం కేసీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళలకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించినట్లు గైనకాలజిస్టు వైద్యులు శిల్ప తెలిపారు. వైద్యులు మంజునాథ్, శిల్పా, క్రితీశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల గుర్తింపునకు సర్వే

శాంతిపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశాల మేరకు ఇంటింటా సర్వేను చేపడుతున్నట్లు ఎంపీడీఓ కుమార్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక పింఛన్లు, వంటగ్యాస్ కనెక్షన్లు, కాలనీ ఇళ్ల తోపాటు తాగునీటి కుళాయిల వసతి కోసం క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులను గుర్తిస్తున్నట్లు తెలిపారు.



శ్రీబాటగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక శ్రీబాటగంగమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణతో అర్చనలు, పూజలు జరిపారు. భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు.

బాధ్యతల స్వీకరణ.. పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలో 14మంది వీఆర్వోలు బాధ్యతలు స్వీకరించారని ఇన్‌ఛార్జి తహసీల్దార్ ప్రసన్నకుమార్ మంగళవారం తెలిపారు. వీఆర్వోలకు జిల్లా ఉన్నతాధికారులు నియామక ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. భూసమస్యలు, రెవెన్యూ పరమైన అంశాలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

బాధ్యతతో విధులు నిర్వహించండి

సోమల : బాధ్యతగా విధులు నిర్వహించి ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, మాజీ సర్పంచి శ్రీనివాసులునాయుడు పెద్దఉప్పరపల్లె ప్రాంతంలో వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సోమలలో పాతచెరువు, కొత్తచెరువు ప్రాంతంలో పొలాలకు వెళ్లే దారి సమస్యను పరిష్కరించాలని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణ, ఎంఈవో శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నీటి కిట్టు.. ఉపయోగిస్తే ఒట్టు

● పట్టించుకోని అధికార యంత్రాంగం
● ప్రజలకు కలుషిత జలాలే దిక్కు

మండలం	పంచాయతీలు	గ్రామాలు	జనాభా	సచివాలయాలు
పుంగనూరు	23	177	54,956	21
చౌడేపల్లె	19	146	42,103	17
సోమల	15	152	52,014	13
సదుం	18	194	31,247	15
పులిచర్ల	25	200	34,247	13
రొంపిచర్ల	10	127	28,218	10

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో కలుషిత నీటితో గ్రామీణులు రోగాల బారిన పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడి తాగునీటి నాణ్యత పరీక్షలు అటకెక్కాయి. పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయక పోవడం, తాగునీటి పైపులైన్లు సరఫరాలో ఒత్తిడి తట్టుకోలేక నిత్యం పగిలి తాగునీరు కలుషితం అవుతోంది. పైపులైన్ల లీకేజీలు, మోటార్లు, ట్యాంకుల వద్ద ఎక్కువ రోజులు జలం నిల్వ ఉండి మురుగునీరు మారి తిరిగి పైపుల్లోకి చేరి కలుషితం అవుతున్నాయి.

● కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా నియోజకవర్గంలో సుమారు 100 మల్టీ పెరామీటరు వాటర్ క్వాలిటీ ఫిల్డ్ టెస్ట్ కిట్లు వచ్చాయి. ఒక్కొక్క ఎఫ్‌టీకేలో ఉదజని సూచిక (పీహెచ్), క్షార గుణ సాంద్రత, సంపూర్ణ కఠినత్వం, నైట్రేట్, ఫ్లోరైడ్, ఇనుము, రెసిడ్యూల్ ఫ్రీ క్లోరిన్ గుర్తించేందుకు పరీక్షలు చేయాల్సి ఉంది. వీటిని గుర్తించి నివారించేందుకు కావాల్సిన రసాయనాలు, మందు బిల్లలు ఇచ్చారు. వీటి వాడకంపై పంచాయతీ, గ్రామ సచివాలయ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులకు శిక్షణ ఇచ్చారు. అయినప్పటికీ వాటిని చాలాచోట్ల వినియోగించలేదు.



వినియోగంలో లేని నీటి కిట్టు

తాగునీటి పరీక్షలు చేయిస్తాం

గ్రామాల్లో తాగునీటి పరీక్షలు చేయిస్తాం. మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతాం.

- వి. రాజేంద్రన్, డీఈ ఇన్‌ఛార్జి, పుంగనూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే

● **సమస్య:** పట్టణంలోని ఆయ్యంకులవీధి బోరుగులబట్టి వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. చీకటి కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీధి దీపాలను అధికారులు ఏర్పాటు చేయాలి. **- స్థానికులు**

● **సమాధానం:** సిబ్బందిని పంపి దీపాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- ఎన్వీరమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, పలమనేరు

గంగవరం, న్యూస్‌టుడే

● **సమస్య:** పలమనేరు, మదనపల్లె జాతీయ రహదారిలోని గంగవరం ఫ్లైఓవర్ నాలుగు రోడ్ల కూడలి వద్ద మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి. **- స్థానికులు**

● **సమాధానం:** మురుగునీరు రోడ్డు మీదకు రాకుండా కాలువ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

- సుధాకర్, కార్యదర్శి



సత్యగంగమ్మ ఆలయంలో నగదు లెక్కిస్తున్న భక్తులు

హుండీ ఆదాయం రూ.2.20 లక్షలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శివాలయం హుండీ ద్వారా రూ.2.20 లక్షల ఆదాయం వచ్చిందని దేవాదాయ శాఖ అధికారి భాస్కరరెడ్డి తెలిపారు. మంగళవారం భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. శ్రీసత్యగంగమ్మ ఆలయ హుండీ ద్వారా రూ.1.02 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని ఆలయాల ఖాతాకు జమ చేస్తున్నట్లు వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కన్నయ్యశెట్టి తెలిపారు. జువాలజీ, ఇంగ్లీషు పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లీషు, ఎమ్మెస్సీ జువాలజీ అర్హత కలిగిన వారు శనివారం లోపు దరఖాస్తులు పంపాలని సూచించారు. మహిళ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు.



ఎమ్మెల్యేను అభినందిస్తున్న రవికుమార్‌నాయుడు

ఎమ్మెల్యేని కలిసిన జడ్పీ సీఈవో

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని తెదేపా కార్యాలయంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు కలిశారు. మంగళవారం ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి సీఈవోతో ఎమ్మెల్యే చర్చించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణం ఎంఆర్‌రెడ్డి కూడలిలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం ప్రారంభించారు. సంఘాల ద్వారా రుణాలు పొంది, స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు తయారు చేసిన ఆహార, వస్త్ర, ఆభరణ తదితర స్టాల్‌ను ఏర్పాటు చేశారు. మహిళా ఆర్థిక స్వావలంబనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఈవో జగదీష్, కౌన్సిలర్లు సోము, సురేష్, మున్సిపల్ తెదేపా అధ్యక్షుడు రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, ఎంఆర్ సురేష్, వేణు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు

ప్రతిభా పాటవ పోటీలు

పలమనేరు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన గంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఈనాడు ప్రతిభ పాటవ పోటీల్లో పాల్గొన్నారు. మంగళవారం 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులు ఇంటర్ నెట్ వలన కలిగే లాభాలు, సామాజిక మాధ్యమంతో విద్యార్థులపై ప్రభావం అనే అంశాలపై వ్యాసాలు రాశారు. ఇందులో 9వ తరగతి విద్యార్థిని కుల్‌సుమ్ ఫాతిమ ప్రథమ, హసీనా తృతీయ బహుమతులు అందుకున్నారు. పదో తరగతి విద్యార్థిని జె.అభినయ ద్వితీయ బహుమతి సాధించారు. ప్రధానోపాధ్యాయిని రూపాదేవి విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



వనమలదిన్నె జడ్పీ ఉన్నత పాఠశాలలో అర్ధాంతరంగా ఆగిన తరగతి గదులు

తెదేపా ప్రారంభించి.. వైకాపా విస్మరించి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తెదేపా హయాంలో ఉన్నప్పుడు 2018లో సర్వశిక్షా అభియాన్ ద్వారా రూ.15 లక్షలు అంచనాతో మండలంలోని వనమలదిన్నె జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు తరగతి గదులు నిర్మాణం చేపట్టారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని పక్కన పెట్టేశారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. అప్పటి నుంచి మొండి గోడలకే పరిమితమైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భవనాలను పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో చంద్రశేఖర్ రెడ్డిని న్యూస్‌టుడే వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదిక పంపామని త్వరలో పనులు చేపడుతామని పేర్కొన్నారు.

ఆధునిక సేద్యంలో అధిక ప్రయోజనాలు

శాంతిపురం, న్యూస్‌టుడే: సాంకేతికతతో కూడిన ఆధునిక వ్యవసాయం విధానంతో అధిక ప్రయోజనాలను సాకారం చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. మండల పరిధి 121-పెద్దూరు పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని వివరించారు. పీఎం కిసాన్, రైతు భరోసా వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. పంటలపై వన్యప్రాణుల దాడుల నివారణోపాయాలను తెలియజేశారు. డీడీఏ నాగపద్మిని, డీడీఏ అన్నపూర్ణ, ఏఓ అపోజీ తదితరులు పాల్గొన్నారు. **పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** రైతులు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేందుకు నూతన పద్ధతుల్లో సాగు చేయాలని ఏవో ఫయాజ్ తెలిపారు. మండలంలోని ఎర్రగుంట్లపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు కోలాట వెంకటరమణ, శ్రీనివాసులు, కిరణ్, గురప్ప, సతీష్, శంకర, రమణమూర్తి ఎల్.సురేంద్ర పాల్గొన్నారు. సోడిగానిపల్లె(గుడుపల్లె), న్యూస్‌టుడే: క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులు వీడి సేంద్రీయ ఎరువులు వాడకంతో సాగు చేసిన పంటల నుంచి ఆశించిన ఫలసాయాన్ని పొందగలమని మండల వ్యవసాయాధికారి నాగరాజు రైతులకు వివరించారు. మండల పరిధి మంగళవారం సోడిగానిపల్లె సమీపంలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. **గంగవరం, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు ఏడీఏ శివకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని గుండుగల్లులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిప్ పరికరాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, సర్పంచి ఎం.వెంకటరమణ, వ్యవసాయాధికారిణి హేమలత పాల్గొన్నారు.



శాంతిపురం: అవగాహన కల్పిస్తున్న జేడీఏ మురళీకృష్ణ తదితరులు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

రామకుప్పం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసమూర్తి, మాజీ సర్పంచులు పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, కోదండరెడ్డి పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య

గుడుపల్లె, న్యూస్‌టుడే: వర్షాభావం కారణంగా గత రెండు నెలలుగా కస్తూర్బా విద్యాలయంలో నెలకొన్న నీటి సమస్యపై స్థానిక నాయకులు చొరవ తీసుకుని మంగళవారం నూతనంగా బోరు బావిని తవ్వించారు. బోరులో నీరు సమృద్ధిగా రావడంతో సమస్య తీరినట్లు అయింది. కుప్పం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పురుషోత్తం పనులను పర్యవేక్షించారు.

రీసర్వే సమస్యలపై వినతుల స్వీకరణ

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కడపనత్తం సచివాలయంలో రీ సర్వే సమస్యలపై రెవెన్యూ అధికారులు మంగళవారం గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. గతంలో చేపట్టిన భూముల రీ సర్వేలో ఏమైనా తప్పిదాలు, సర్వే నంబర్లు తారుమారు, విస్తీర్ణంలో తేడా ఉన్నట్లయితే పరిశీలించి సవరణకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మాధవరాజు తెలిపారు. ఆర్ఐ సరిత, సర్వేయర్ రామాంజులు, వీఆర్వో వెంకటేష్, తెదేపా నాయకులు మంజునాథ్, రమేష్‌బాబు



జ్యోతి వెలిగిస్తున్న అధికారులు

సైన్సుపై ఆసక్తి పెంచుకోవాలి

పలమనేరు, న్యూస్‌టుడే: విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తి పెంచుకోవాలని డీవైఈవో చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌కు మంగళవారం ఆయన హాజరయ్యారు. హైస్కూలు స్థాయి నుంచి కూడా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని 7 గురుకుల పాఠశాలల నుంచి 104 మంది విద్యార్థులు 94 ప్రయోగాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రమణ, చిత్తూరు, తిరుపతి జిల్లాల డీసీవో పద్మజ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

పుంగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే గ్రామ సభల ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని తహసీల్దారు రాము అన్నారు. మంగళవారం మండలంలోని మంగళం గ్రామ సచివాలయంలో గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు మాధవరెడ్డి, రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

పుంగనూరు, న్యూస్‌టుడే: కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ హోమియో వైద్యశాల అధికారి నాగేనాయక్ కోరారు. మంగళవారం స్థానిక కొత్తఇండ్లు పురపాలక ఉన్నత పాఠశాలలో హోమియో ఆస్పత్రి ద్వారా విద్యార్థులకు మందులు పంపిణి చేశారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం రాజు, తెదేపా నాయకులు సుబ్రమణ్యంరాజు, ఏపీజీఈ అసోషియేషన్ సంయుక్త కార్యదర్శి అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

గంగవరం, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నమనాయనపల్లెలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిచే గర్భిణులకు సీమంతం చేశారు. డాక్టర్ శ్రీనివాసులు తన సొంత డబ్బుతో గర్భిణులకు సీమంతం చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లహరి, వైద్యసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

బడి పిల్లల పడిగాపులు

శాంతిపురం మండల కేంద్రం నుంచి కళాశాలలు, పాఠశాలలకు రాకపోకల కోసం ఉదయం వేళల్లో ఆర్టీసీ బస్సులు తగినన్ని లేనందున విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. గ్రామాల నుంచి ఆటోల ద్వారా మండల కేంద్రానికి చేరుకునే విద్యార్థులు కుప్పం వైపు వెళ్లే బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, శాంతిపురం





పుంగమ్మ దేవతకు ఊరేగింపుగా గెరిగెలు తీసుకెళ్తున్న స్థానికులు

పుంగమ్మకు గరిగెల చెల్లింపు

పుంగనూరు : పట్టణంలోని చింతలవీధి ప్రజలు మంగళవారం పుంగమ్మ దేవతకు గరిగెలు చెల్లించారు. ఏటా అమ్మవారికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. పంటలు బాగాపండాలని, పశుసంపద వృద్ధి చెందాలని, ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు.

రేపు రక్తదాన శిబిరం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరం తమ సంస్థ, రోటరీ క్లబ్, శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంసీవీ డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఔత్సాహికులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సాంకేతికతకు నోచని గ్రంథాలయాలు



పలమనేరు గ్రంథాలయ భవనం

పలమనేరు, న్యూస్‌టుడే: గ్రంథాలయాల డిజిటలైజేషన్ ప్రక్రియ ఆచరణకు నోచుకోలేదు. గత వైకాపా ప్రభుత్వ కాలంలో పోస్టుల భర్తీ కూడా చేపట్టలేదు. ఐదేళ్లలో ప్రతినెలా జీతాలకు ఇవ్వని పరిస్థితి. ఇక ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ఐదేళ్లు పట్టించుకోలేదు. జిల్లాలోని 72 గ్రంథాలయాల్లో కేవలం తిరుపతి, చిత్తూరు గ్రంథాలయాలను మాత్రం అప్పట్లో తెదేపా ప్రభుత్వం డిజిటలైజేషన్ చేసింది. మిగిలినవి పాత విధానంలోనే నడుస్తున్నాయి. ఇక వివిధ రకాల పుస్తకాలు తెప్పించుకోవడానికి నిధుల

గ్రంథాయాలకు కావలసినవి

- కంప్యూటరీకరణ
- సిబ్బంది
- అప్‌డేట్‌గా పుస్తకాలు,
- ఇంటర్‌నెట్ వసతి
- అభివృద్ధికి నిధులు

పోస్టుల భర్తీకి గ్రహణం

కొరత పీడిస్తోంది. ఇటీవల మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారాలోకేష్ విశాఖ జిల్లాలో పర్యటిస్తూ గ్రంథాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి స్థితిగతులను అధ్యయనం చేసి ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలోని 40 గ్రంథాలయాల్లో గుమస్తా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రంథాలయాధికారి ఒక్కరే అన్ని పనులు చూసుకోవాలి. గ్రంథాలయాలకు రోజుకు 40 నుంచి 60 మంది వరకు పాఠకులు వస్తుంటారు. ఈ సంఖ్యను పెంచడానికి తాజా పుస్తకాలను తెప్పించాల్సి ఉంది.

పేరుకే పన్నులు

మున్సిపాలిటీల్లో, పంచాయతీల్లో గ్రంథాలయ పన్నులను వసూలు చేస్తుంటారు. ఆ మొత్తాలను గ్రంథాలయాలకు చెల్లించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఇంటి పన్నుతో పాటు 15 శాతం గ్రంథాలయ పన్ను వసూలు చేస్తారు. 8 శాతం నిధులను గ్రంథాలయాలకు ఇవ్వాల్సిఉంది. ఆ దిశగా చర్యలు జరగడంలేదు. కొన్ని మున్సిపాలిటీల్లో వసూలైన పన్ను మొత్తం గ్రంథాలయాలకు వస్తున్నాయి.

వారోత్సవాలు ఓ ప్రహసనం

గ్రంథాలయ వారోత్సవాల పేరిట ప్రభుత్వం ప్రతియేటా వారం రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అందులో ఏదో మొక్కుబడిగా పాఠకులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా విద్యార్థులను భాగస్వాములను చేయాలి. అప్పుడే గ్రంథాలయాలకు యువ పాఠకుల సంఖ్య పెరుగుతుంది.

ప్రతిపాదనలు పంపాం

ప్రస్తుత ప్రభుత్వానికి గ్రంథాలయాల డిజిటలైజేషన్ ప్రతిపాదనలను పంపించాం. పోస్టుల భర్తీకి నివేదిక సిద్ధం చేశాం. అన్ని వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- ఆర్‌వీఆర్‌ఎస్ఎస్ శర్మ, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, చిత్తూరు



చదువుతున్న పాఠకులు

లాటరీ టికెట్ల పట్టివేత.. పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని నగరి వద్ద మంగళవారం లాటరీ టికెట్లు విక్రయిస్తున్న మురళిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 54 లాటరీ టికెట్లు, రూ.5,500 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అతనికి ఎవరు లాటరీ టికెట్లు పంపిణీ చేశారు, ఎక్కడ నుంచి వస్తున్నాయన్న వివరాలపై దృష్టి సారించినట్లు సీఐ పేర్కొన్నారు.

రైతుల చైతన్యం.. పూడుతున్న గోతులు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని లద్దిగం చెరువు ఆయకట్టు రైతుల్లో వచ్చిన చైతన్యం అనధికారిక ఇసుక తవ్వకాలకు చెక్ పడింది. రెండు రోజుల క్రితం ఇసుక తవ్వకాలను రైతులు అడ్డుకోవడంతో అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు మంగళవారం లద్దిగం చెరువులో లోతైన ఇసుక గుంతలను పూడ్చడం ప్రారంభించారు. తహసీల్దారు హనుమంతు ఇసుక వాహనాలకు జరిమానా విధించడంతో పాటు వాటి ద్వార గుంతలను పూడ్చాలని ఆదేశించారు. దీంతో గుట్టలుగా ఉన్న మట్టిని గుంతల్లోకి తోసి చదును చేసే పనుల్లో సంబంధిత వాహనాలు నిమగ్నమయ్యాయి.



ఇసుక తవ్వకాలతో ఏర్పడిన లోతైన గుంతలు పూడ్చుతున్న వాహనాలు